నమస్తే తెలంగాణ

జగిత్యాల

5 | కరీంనగర్, బుధవారం 11 డిసెంబర్ 2024 | JAGTIAL

# ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు సమానవేతనం అందించాలి
- ఎన్నికల ముందు రేవంత్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, డిసెంబర్ 10 : ఎన్నికల ముందు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత, సమాన వేతనం అందించాలని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి, ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయిందని, నిరుద్యోగులు, మహిళలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానవేతనం అందిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారని, మరి అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఆ మాట ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న లక్షా నలభై వేల మందిని కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, నెల రోజుల్లోనే పరిష్కారం చూపుతామని ఏడాది గడిచినా ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీశారు. ప్రజలకు తప్పుడు మాటలు చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని దుయ్యబట్టారు. సర్పంచుల సమస్యలను నెల రోజుల్లోనే పరిష్కస్తామని చెప్పిన సీతక్క ఎక్కడకు వెళ్లారని, ఇప్పుడా శాఖకు మంత్రి కూడా ఆమెనని, మరి ఎందుకు ఏడాదిగా సర్పంచుల సమస్యలను పరిష్కరించడం లేదో చెప్పాలని నిలదీశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల మహేశ్, కెసారం తిరుపతి, గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

# తల్లీ వందనం

## తెలంగాణ తల్లి విగ్రహాలకు గులాబీదళం పాలాభిషేకం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో పార్టీ శ్రేణుల కార్యక్రమం
- విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి ఉద్వేగం
- కాంగ్రెస్ విగ్రహ ఆకృతిని మార్చడంపై ఆగ్రహం



కరీంనగర్: తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారదాసు, బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ నాయకులు

### విగ్రహాన్ని మార్చడం సరికాదు

బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కార్పొరేషన్, డిసెంబర్ 10: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయం ఉట్టిపడేలా రూపొందించుకున్న తెలంగాణ తల్లివిగ్రహాన్ని కాదని, కాంగ్రెస్ పెద్దలు సోనియా, రాహుల్‌గాంధీ మెప్పు కోసం సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. ఎక్కడైనా తల్లిని తల్లిగా పూజించుకోవాలే తప్ప తమ స్వార్థాల కోసం విగ్రహాలను మార్చడం సరికాదని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి పార్టీ పెద్దల మెప్పుకోసం పని చేయడం మానుకోవాలని, తెలంగాణ ప్రజల మెప్పు పొందేలా పని చేసి చూపించాలని హితవుపలికారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జీవీఆర్ మాట్లాడుతూ, ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను పక్కదారి పట్టించేందుకు విగ్రహ మార్పు కార్యక్రమాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. ఇలాంటి పనులను తెలంగాణ ప్రజలెవ్వరూ హర్షించరని తెలిపారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, నాయకులు రెడ్డవేణి మధు, గడ్డం ప్రశాంత్‌రెడ్డి, చందు, ఆరె రవి తదితరులు పాల్గొన్నారు.



రాయికల్: తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నినదిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, నాయకులు




సిరిసిల్ల టౌన్: తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాభిషేకం చేస్తున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జిందం చక్రపాణి, నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్/జగిత్యాల/మంథని, డిసెంబర్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ నాయకులు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున స్పందించారు. మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలతోపాటు పంచామృత అభిషేకాలు చేశారు. తెలంగాణతల్లి విగ్రహం ఉద్యమ ఉద్వేగానికి ప్రతీకగా నిలుస్తుందని, ఆమె రూపం చూసిన ప్రతి ఒక్కరి గుండెల్లో ఉద్యమస్ఫూర్తి రగులుతుందని, యావత్ తెలంగాణ జాతి సమష్టి ఉద్యమం, సాంస్కృతిక పోరాటం గుర్తుకు వస్తుందని ఉద్వేగానికి లోనయ్యారు. కానీ, తెలంగాణతల్లి పేరు చెప్పి కాంగ్రెస్ మూర్ఖులు చేసిన అపచారానికి చరిత్ర తెలియని ఆ పార్టీని క్షమించాలని వేడుకున్నారు. పార్టీ అధిష్టానం మెప్పు కోసమే రేవంత్‌రెడ్డి విగ్రహ ఆకృతిని మార్చుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఇలాంటి నిర్ణయాలు మానుకొని.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్.. గన్నేరువరం మండలంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్.. రామడుగు మండలం తిర్మలాపూర్, కొడిమ్యాల మండలం నమిలికొండలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్.. రామగుండం మున్సిపల్ ఆఫీస్ సమీపంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ క్షీరాభిషేకం చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్‌లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, సిరిసిల్లలో నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. ఆయాచోట్ల నాయకులు మాట్లాడారు. తెలంగాణకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను తెలంగాణ తల్లి చేతిలో నుంచి మాయం చేసి.. కాంగ్రెస్ పార్టీ గుర్తు పెట్టడం అన్యాయమన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై కక్షతో విగ్రహాన్ని మార్చడాన్ని తెలంగాణ సమాజం ఖండిస్తుందన్నారు.


### మన అస్తిత్వ ప్రతీక

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి మన అస్తిత్వానికి ప్రతీక అని, ఆ తల్లి విగ్రహాన్ని మార్చడం అంటే తెలంగాణ స్ఫూర్తిని అవమానించడమేనని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మారితే తలరాతలు మారాలె తప్పా.. తల్లి రూపురేఖలు కాదని సూచించారు. మంగళవారం రామగుండం మున్సిపల్ ఆఫీస్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం చందర్ మాట్లాడుతూ, తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం గురించి కనీసం సోయిలేకుండా హస్తం గుర్తు పోలి ఉన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర అధికార చిహ్నంలో చార్మినార్ వద్దని, కాకతీయ కళాతోరణం ఎందుకని.. ఇప్పుడు తెలంగాణ తల్లే వద్దంటున్నారని.. రేపు తెలంగాణ రాష్ట్రమే ఎందుకని కూడా అంటారని విమర్శించారు. కాంగ్రెస్ తల్లికి ఎప్పటికీ తెలంగాణ గల్లీలో స్థానం ఉండదన్నారు. ఇక్కడ కార్పొరేటర్లు అయిత శివకుమార్, కుమ్మరి శ్రీనివాస్, కవిత సరోజిని, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు మూల విజయారెడ్డి, బొడ్డుపల్లి శ్రీనివాస్, చెలకలపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, నారాయణదాసు మారుతి, బొడ్డు రవీందర్, మేడి సదయ్య, పిల్లి రమేశ్, సట్టు శ్రీనివాస్, సంధ్యారెడ్డి, తోకల రమేశ్ ఉన్నారు.



గన్నేరువరం: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

### రూపం మార్చితే చరిత్ర మారదు

మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

గన్నేరువరం/ ఇల్లంతకుంట, డిసెంబర్ 10 : తెలంగాణ విగ్రహ రూపం మార్చినంత మాత్రాన తెలంగాణ చరిత్ర మారదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకే విగ్రహం మార్పు చేశారని మండిపడ్డారు. మంగళవారం గన్నేరువరంలో తెలంగాణ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఇల్లంతకుంటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ తల్లి రూపం మార్చి కాంగ్రెస్ తల్లి రూపం తీసుకురావడం వల్ల ప్రజలు కోరిన మార్పు జరగదన్నారు. ఇలాంటి విగ్రహాన్ని ప్రజలు ఏనాడూ అంగీకరించన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇప్పటి వరకు పాత పనులను చేయడమే తప్పా ఒక్క కొత్త పనికి పూనుకోలేదని మండిపడ్డారు.



కొడిమ్యాల: నమిలకొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

### తెలంగాణ తల్లే కావాలి

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, డిసెంబర్ 10: కాంగ్రెస్ తల్లి విగ్రహం వద్దని, తెలంగాణ ప్రజలు అభిమానించే తెలంగాణ తల్లి విగ్రహమే కావాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కొడిమ్యాల మండలం నమిలకొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కవులు, కళాకారులు, మేధావులు కలిసి తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారన్నారు. అలాంటి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం తెలంగాణ ప్రజలను అవమానించడమే అన్నారు. కేవలం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆనవాళ్లను చేరిపేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, నాయకులు ఒల్లాల లింగాగౌడ్, చింతపంటి ఆదయ్య, మల్యాల నరేశ్, కొత్తూరి స్వామి, మల్యాల లింగయ్య, పరదేశీ, అంజన్‌కుమార్, చాంద్‌పాషా, ప్యాట అంజి, రొడ్డ శరత్, మొగిలిపాలెం రమేశ్, రాచకొండ చంద్రమోహన్, స్రవంతి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంవోయూ పత్రాలు అందుకుంటున్న ప్రిన్సిపాల్ తదితరులు

# ఎస్సారార్ కళాశాల ఎంఓయూ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 10 : కళాశాల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు, కళాశాల అధ్యాపకులకు రీసెర్చ్ వర్క్ షాప్, శిక్షణ కల్పించేందుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మేనేజ్ మెంట్ విద్యా సంస్థతో ఎస్సారార్ కళాశాల అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ శామీర్‌పేటలోని ఐపీఈ క్యాంపస్ ఆవరణలో మంగళవారం కళాశాల అధ్యాపకులు ఎంట్ర ప్రెన్యూర్షిప్ టసెల్ కన్వీనర్ డాక్టర్ బూర్ల నరేశ్, డాక్టర్ కే అర్జున్, ఐపీఈ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివా స్ మూర్తి, ప్రొఫెసర్ వై రామకృష్ణ బృందం సమక్షంలో సమావేశమైనట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రొఫెసర్లు శ్రీకాంత్, లక్ష్మి కుమారి, ప్రొఫెసర్ రామకృష్ణ, డాక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చండి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్
- నిరవదిక సమ్మె ప్రారంభం
- కలెక్టరేట్‌ల ఎదుట నిరసనలు



నిరవదిక దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

జగిత్యాల, డిసెంబర్ 10 : తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిరవదిక నిరసన దీక్షలు ప్రారంభించారు. కరీంనగర్‌లో చేపట్టిన దీక్షకు కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మద్దతు తెలిపారు. సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జగిత్యాలలోని తహసీల్ చౌరస్తాలో ఉద్యోగులు నిరసన దీక్షలు ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరవధిక సమ్మె దీక్షలు చేపట్టామన్నారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి ₹10 లక్షలు జీవిత, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ చేస్తున్న వారికి చేసిన వారికి బెనిఫిట్స్ ₹25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాశాఖ నియామకాలలో వెయిటేజ్ కల్పించాలని, పీటీఐలకు ₹12 నెలల వేతనం అందించాలని డిమాండ్లతో సమ్మె చేస్తున్నామని చెప్పారు.

# యువకుడిపై దాష్టీకం?

- పోలీసుల కొట్టారంటూ అవమానంతో ఆత్మహత్యాయత్నం
- ప్రాణాపాయ స్థితిలో యువకుడు
- మంథని ఎస్ఐపై తండ్రి దేవేందర్ ఆరోపణలు



రాజ్‌కుమార్ తొడపై గాయాలు



రాజ్‌కుమార్ (ఫైల్)

పెద్దపల్లి, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద జరిగిన గొడవ ఓ యువకుడి అతని ప్రాణం మీదికి తెచ్చింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి తండ్రి మంచిర్యాల జిల్లా జైపూర్‌లో పని చేసే హోంగార్డు శీలం దేవేందర్ కథనం ప్రకారం.. మంథని పట్టణంలోని శ్రీపాదకాలనీకి చెందిన శీలం రాజ్‌కుమార్ ఈ నెల 7న తన ఇంటి నుంచి మంథని వైపు వెళ్తున్నాడు. ఆ క్రమంలో స్థానికంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న కొంత మంది హమాలీలు రాజ్‌కుమార్‌ను పిలిచారు. వారి మధ్య జరిగిన సంభాషణ గొడవకు దారి తీసింది. ఘర్షణ జరిగింది. హమాలీలు వెళ్లి రాజ్‌కుమార్‌పై మంథని ఠాణాలో ఫిర్యాదు చేయగా, పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. ఠాణాకు తరలించి, రాత్రి వరకు అక్కడే ఉంచుకున్నారు. విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ తండ్రి దేవేందర్ స్టేషన్‌కు చేరుకొని, తన కొడుకును ఎందుకు అరెస్టు చేశారని, ఏదైనా జరిగితే కేసు పెట్టాలి కానీ ఇలా దాడి చేయడం ఏంటని నిలదీశాడు. తన కొడుకు పైనే హమాలీలు దాడి చేశారని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కొడుకును బయటికి పంపాలని కోరగా, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం తోపాటు కొట్టిన విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని పోలీసులు బెదిరించారని ఆయన ఆరోపించాడు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చిన రాజ్‌కుమార్, మనస్తాపంతో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి, అపస్మారక స్థితిలో ఉన్న రాజ్‌కుమార్‌ను మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. కోమాలో ఉన్న కొడుకు పరిస్థితిని చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. కాగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్న రాజ్‌కుమార్ వీపు, తొడలు, కాళ్లపై లాఠీ దెబ్బలకు సంబంధించిన తీవ్ర గాయాలు ఉన్నాయని, దీనికి తోడు ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడడంతో మెడ నరాలు దెబ్బతిన్నాయని ఆందోళన చెందుతున్నారు.

### కొట్టడంతోనే ఈ పరిస్థితి

నా కొడుకు ఏదైనా తప్పు చేస్తే కేసు పెట్టాలి. ఆ తర్వాత కోర్టు ఏదైనా శిక్ష విధిస్తే భరిస్తాం. కానీ, విచక్షణారహితంగా దాడి చేశారు. స్వయంగా ఎస్ఐ కొట్టాడని నా కొడుకు చెప్పిండు. ఒంటిపై దెబ్బలు చూపిస్తూ తీవ్ర మనస్తాపం చెందిండు. నేను వెళ్లి ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని నిలదీస్తే కొట్టలేదని అంటున్నారు. కానీ, నా కొడుకు అవమానం భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డడు. నా కొడుకుకు ఈ పరిస్థితికి రావడానికి మంథని ఎస్ఐ రమేశే కారణం. దీనిపై సమగ్ర విచారణ జరిపించి ఎస్ఐ, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

**- దేవేందర్, రాజ్‌కుమార్ తండ్రి**

### రాజ్‌కుమార్‌పై దాడి చేయలేదు

శ్రీపాదకాలనీలో గొడవ జరుగుతున్నట్టు సమాచారం వస్తే పోలీసు సిబ్బంది వెళ్లారు. రాజ్‌కుమార్‌తో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకొని వచ్చారు. రాజ్‌కుమార్ మద్యం మత్తులో ఉన్నాడు. మరుసటి రోజు సైతం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి హమాలీలతో ఘర్షణకు దిగాడు. హమాలీలు వచ్చి రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేస్తే, కేసు నమోదు చేశాం. ఆ తర్వాత మధ్యాహ్నం తిరిగి రాజ్‌కుమార్ హమాలీలతో మళ్లీ గొడవ పడ్డట్లు తెలిసింది. సాయంత్రం ఇంటిలో ఏమైందో ఏమో..? రాజ్‌కుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజ్‌కుమార్‌పై మేం ఎలాంటి దాడి చేయలేదు.

**- రమేశ్, మంథని ఎస్ఐ**